# బైలైన్

ఈ జనారణ్యంలో
మనిషి నిలువెల్లా మోసమై
సంచరిస్తున్నప్పుడు ...
నీతి అడవికాచిన వెన్నెలవుతుంది
మంచినీటి మూటవుతుంది
అందుకే -
నువ్వు మోసగాడిగానైనా మారిపో
చేతకాకపోతే
అడవిలోకి పారిపో!

నేను రాత్రి చదివిన కవిత తళుక్కున నా మదిలో మెదిలింది. నేనూ మోసగత్తెగా మారిపోవాలా? లేక అడవిలోకి పారిపోవాలా? అడవిలోకి పారిపోతే స్వర్ణక్కలాగా తయారవుతానేమో?

నా ఆలోచనకు నాకే నవ్వొచ్చింది.

నో...! నేనలా ఎన్నటికీ మారిపోను.

అఫ్‌కోర్స్... లక్ష్యసాధనలో అన్నలు ఎంచుకున్న మార్గం ఆయుధం కావచ్చు. అది వాళ్ళ అభిరుచి, అభిప్రాయం. కానీ నేను తుపాకీతో నా లక్ష్యాన్ని చేరుకోను. నా ఆశయం, ఆయుధం... కలం!

దట్సాల్!

లక్ష్యసాధనను మోసంతోనే చేరుకోనక్కర్లేదు. ఆ కవి అభిప్రాయం తప్పేమో... చిత్తశుద్ధి, పట్టుదల ఉంటే చాలు. అనుకున్న గమ్యాన్ని, లక్ష్యాన్ని చేరుకోగలం. అయినా నేను చదివే చదువేంటి? నా ఆలోచనలేంటి ఈ విధంగా సాగుతున్నాయ్? మరో రెండేళ్ళు కష్టపడితే చాలు మెడిసిన్ డిగ్రీ చేతికొస్తుంది. అప్పుడు నేను కూడా జూనియర్ డాక్టర్ని

అవుతాను. నేను కూడా సమ్మెలో పాల్గొని స్టయిఫండ్ పెంచమని నినాదాలు ఇస్తానేమో! అలా ఎందుకనుకోవాలి? చక్కగా వైద్యవృత్తి చేస్తూ ప్రజాసేవ చేయచ్చుకదా!

ఎందుకో నాకీ ప్రొఫెషన్ అంటే ఇంట్రెస్ట్ లేదు. వీధికి పదిమంది చొప్పున డాక్టర్లున్న ఈ రోజుల్లో నేను కొత్తగా ఉద్ధరించేదేమిటి? గుంపులో గోవిందమ్మ నవుతాను.

అలా కాకూడదు. మొదట్నుంచీ పత్రికలు, రకరకాల నావెల్స్ చదవటం వల్లనేమో జర్నలిజం అంటే మక్కువ పెరిగిపోయింది. నేను అనుకోకుండానే జర్నలిజంవేపు మొగ్గు చూపాను. ఇప్పటికే ఎన్నో వ్యాసాలు... కథలు వివిధ పత్రికల్లో వచ్చాయి. మన అభిప్రాయాలను అక్షర రూపంలో పెట్టి వాటిని పత్రికలకు పంపి అవి అచ్చయినప్పుడు కలిగే ఆనందం, తృప్తి ఎందులో లభిస్తుంది? అదో మధురానుభూతి. భాషకందని భావం. నా అభిప్రాయాలను, మనస్సును వీళ్ళంతా ఎందుకు అర్థం చేసుకోరు? పొద్దున్న అన్నయ్య హాస్టల్‌కు వచ్చి ఎంత రాద్ధాంతం చేసిపోయాడు? అసలు ఈ విమలకు బుద్ధిలేదు. నేను చదువుమీద కాన్సన్‌ట్రేట్ చేయటంలేదని, అస్తమానం పత్రికలు చదువుతూ, కవితలు వ్యాసాలు రాస్తున్నానని ఇంటికి లెటర్ రాసింది. ఇడియట్! అది చదివి అమ్మా, నాన్నలు అన్నయ్యను పంపారు. వెళ్ళి దానికి బుద్ధి చెప్పమని, నేనేమైనా చిన్నపిల్లనా? ఛీ... ఛీ!... అందరి ముందు తిడుతూ తలెత్తుకోకుండా చేశాడు. హాస్టల్ వార్డెన్ కూడా చెడామడా తిట్టిపోసింది. నో... ఇక నేను ఈ హాస్టల్లో ఉండకూడదు. బయటికి వెళ్ళిపోవాలి...! స్వరాజ్యం పత్రిక ఎడిటర్ ఎప్పటినుంచో అడుగుతున్నాడు 'మేడమ్! మీరు పార్ట్ టైమ్ రిపోర్టర్‌గానైనా మా పత్రికలో చేరండి! మీరు ఊహించనంత శాలరీ ఇస్తాను' అని ఎస్... అంతే చేయాలి. పార్ట్‌టైమ్ కాదు నాయనా, ఫుల్‌టైమ్ చేస్తాను అని చెప్తే ఎగిరి గంతేస్తాడేమో? అతను గంతులేయటం సరే, ఇంట్లోవాళ్ళు నన్ను అసలు ఇంటి గడప తొక్కనీయకపోవచ్చు. పోనీ...! కొన్నాళ్ళ తర్వాత వాళ్ళే నాదారికి వస్తారు. ఎవరో ఏదో అనుకుంటారని నాకిష్టం లేని పనిని చేయటం నావల్లకాని పని. నా దారే కరెక్ట్ అని ప్రూవ్ చేయాలి.

రేపే వెళ్ళి ఎడిటర్‌ను కలిసి చెప్పేస్తాను. ఎంచక్కా సెపరేట్‌గా రూమ్ తీసుకుని హాయిగా, స్వేచ్ఛగా బతుకుతాను. పొద్దుటే కోఠీలో ఓ హోర్డింగ్ చూశాను. సెల్‌ఫోన్ అడ్వర్టయిజ్‌మెంట్ కొటేషన్..... 'ఫ్రీడమ్ ఈజ్ పీస్ ఆఫ్ మైండ్' అని రాశారు.

అవును.....

అది నిజమే. స్వేచ్ఛలో లభించే మనశ్శాంతి మరి దేన్లోనూ లేదు. ఎవరోగానీ, మంచి కొటేషన్ ఇచ్చారు. ఈ రోజే ఆఖరిరోజు... ఇక ఈ హాస్టల్‌కు... మెడిసిన్... అబ్బా! ఈ

ఆలోచనే ఎంత రిలీఫ్‌గా ఉంది! ఈ విమల ఇంకా రాలేదేమిటి? దీని తిరుగుళ్ళు ఆపలేకపోయాను. ప్చ్... ఇది మళ్ళీ నాకు నీతులు చెప్తుంది. ఏ బాయ్ ఫ్రెండ్‌తో చెక్కర్లు కొడుతోందో?! ఛావనీ ... అది ఎలా పోతే నాకేంటి? మంచినీళ్ళు తాగి దుప్పటి తీసి ముసుగు కప్పుకుని హాయిగా ప్రశాంతంగా మనశ్శాంతిగా కళ్ళు మూసుకున్నాను.

* * *

'మేడమ్! సార్ పిలుస్తున్నారు!' అటెండర్ భిక్షమయ్య చెప్పాడు. పేపర్ చదువుతున్న నేను అతనివైపు చూసి తలూపాను. ఛెయిర్ వెనక్కి జరిపి, లేచి ఎడిటర్ ఛాంబర్‌లోకి వెళ్ళాను.

'రండి, ఝాన్సీగారూ! మీరు మా పత్రికలో చేరిన నెలరోజుల్లోనే అద్భుతమైన రెండు స్పెషల్ స్టోరీస్ ఇచ్చారు. పాఠకుల నుంచి మంచి రెస్పాన్స్ వచ్చింది... మళ్ళీ కంగ్రాట్స్ చెప్తున్నాను!' అన్నాడు కళ్ళజోడు కిందనుంచి నన్ను గమ్మత్తుగా చూస్తూ.

'థ్యాంక్యూ, సర్! అందులో నా గొప్పతనమేముంది? వాస్తవాలను ప్రజెంట్ చేశాను!' అన్నాను నవ్వుతూ.

'నో.. నే నొప్పుకోను! అది నిజంగా మీ గొప్పతనమే...! మీరు ఎంతో రిస్క్ తీసుకుని ఇన్వెస్టిగేట్ చేసి ఆ ఐటమ్స్ రాశారు. అవి పబ్లిష్ అయిన తర్వాత పోలీస్ రైడింగ్స్ జరిగి ఆ దేవాలయం ప్రాంతంలో వ్యభిచారం జరగకుండా కట్టుదిట్టం చేశారు. సి. ఐ. నాకు ఫోన్‌చేసి మరీ చెప్పాడు. 'ఎవరు సార్, ఆ ఝాన్సీగారు! మాకు చెమటలు పట్టేలా చేసింది.....హోమ్ మినిస్టర్ మా ఎస్పీని చెడామడా తిట్టేశారట... ఆయన మా మీద విరుచుకుపడ్డాడు. మేము వెంటనే రెయిడ్ చేసి ఆ ఏరియాని క్లీన్ చేశాం" అని అడిగాడు సి.ఐ. అని నవ్వుతూ చెప్పాడు.

నేను నిశ్శబ్దంగా నవ్వి, 'అసలు సమస్యను అంతమొందించటం మన చేతుల్లో లేదు కదా సార్! కనీసం ఆ దేవాలయం ఏరియాలో వ్యభిచారం జరగకుండా చేయాలనే నేను ఆ ఐటమ్ రాశాను. లేకపోతే మామూలు గృహిణులు కూడా అక్కడ వేధింపులకు గురవుతున్నారు. నేనూ అక్కడ హెరాస్‌మెంట్లకు గురయ్యాను. అందుకే అంత పవర్‌ఫుల్‌గా రాయాల్సొచ్చింది!' అన్నాను నవ్వుతూ.

'యు హేవ్ డన్ ఏ వెరీగుడ్ జాబ్, ఝాన్సీ! ఇది వరకు వేరే పత్రికలు కూడా ఈ విషయం రాశాయి గానీ, మీరు ఫోటోలతో సహా అక్కడ ఎవరి అండదండలు ఉన్నాయి? ఏ పార్టీవాళ్ళు వారికి కొమ్ము కాస్తుందీ పకడ్బందీగా రాయబట్టే అధికార పార్టీకి చురుక్కుమంది!' అన్నాడు ఎడిటర్.

అటెండర్ కాఫీ ట్రేతో లోపలికి వచ్చాడు.

'కాఫీ తీసుకోండి!' అన్నాడు ఎడిటర్ మూర్తి. ఆయనకు దాదాపు అరవై సంవత్సరాలుంటాయి. ఝాన్సీలాంటి డైనమిక్ యంగ్‌లేడీ రిపోర్టర్‌గా రావటం, పైగా మెడిసిన్ డిస్‌కంటిన్యూ చేసి డెడికేటెడ్‌గా పనిచేయటం వల్ల ఆ పెద్దాయన థ్రిల్ ఫీలవుతున్నాడు.

'మన పత్రిక ఫ్రంట్ పేజీలో మీ బైలైన్ ఉంటే చాలు... రీడర్స్ ముందుగా మీ ఐటమే చదువుతున్నారట! మన స్టాఫే చెబుతున్నారు!' అన్నాడు ఆనందంగా.

'మీరు నన్ను మరీ పొగిడేస్తున్నారు. అంత లేదేమో...' అన్నాను నవ్వుతూ.

'నో! నో! ఇది ముఖస్తుతి కాదు, ఝాన్సీ! ఫాక్ట్! నిజం... పచ్చినిజం!' అన్నాడు సిగరెట్ వెలిగించుకుంటూ.

నేను నవ్వాను.

'బై ది బై, ఈ రోజు అమెరికా నుంచి ఆ దేశ రాయబారి మన నగరానికొస్తున్నారు. సి. ఎం. ప్రెస్‌మీట్ పెట్టాడు. మీరే ఆ ప్రెస్‌మీట్‌కు అటెండ్ కావాలి!' అన్నాడు.

నేను ఇబ్బందిగా చూశాను.

'అఫ్‌కోర్స్! మీ ఫీలింగ్స్ నాకర్థమయ్యాయి. ఇది రొటీన్ ప్రెస్‌మీటే కదా! వేరే ఎవరినయినా పంపచ్చు కదా అని నువ్వనుకోవచ్చు. బట్, నువ్వయితే ఆ ప్రెస్‌మీట్‌నే వేరే విధంగా డిఫరెంట్‌గా ప్రజంట్ చేస్తావు. అదే.. ఆ ప్రత్యేకతే నాకు కావాలి! మిగతా పత్రికలకంటే మన కవరేజ్ బాగుండాలి. మన ఫోటోగ్రాఫర్ మారుతి కూడా నీతో వస్తాడు. నువ్వు రిజెక్ట్ చేయకుండా ఈ ఎస్పైన్‌మెంట్ యాక్సెప్ట్ చెయ్యాలి, ఒకే!' అన్నాడు నవ్వుతూ సిగరెట్‌ని యాష్‌ట్రేలో కుక్కుతూ.

నేను అలాగే అన్నట్లు నవ్వుతూ తలూపాను.

ఇంతలో ఫోన్ రింగైంది. ఫోనెత్తి 'హలో!' అన్నాడు.

'సార్! అలాగే... ఒక్క నిమిషం...!' అంటూ రిసీవర్‌ను మూస్తూ 'ఒకే ఝాన్సీగారూ! మీరు ప్రెస్‌మీట్ కవర్‌చేసి రండి!' అన్నాడు నాతో. నాకర్థమైంది అవతలి వ్యక్తి ఎం.డి. అయి ఉంటాడు. అందుకే నన్ను బయటకు పంపుతున్నాడు. ఆయనతో ఏం సీక్రెట్స్ మాట్లాడాలో అనుకుని...

'అలాగే, సార్! వస్తాను!' అని చెప్పి బయటకు వచ్చాను.

* * *

కైనెటిక్ హోండా కీస్ శ్యామల దగ్గర అడిగి తీసుకుని పార్కింగ్ ప్లేస్ దగ్గరకొచ్చి హోండా స్టార్ట్ చేశాను. అప్పుడే అటువైపు ఫ్లాస్క్ తీసుకుని అటెండర్ భిక్షమయ్య వెళ్తున్నాడు.

'భిక్షమయ్యా! ఫోటోగ్రాఫర్ మారుతిని ఓసారి ఇలా రమ్మని చెప్పు. త్వరగా!' కేకేసి చెప్పాను.

'అలాగే మేడమ్!' అని చెప్పి వడి వడిగా అడుగులు వేస్తూ లోపలికెళ్ళాడు.

'హాయ్, డైనమిక్! ఏంటీ ఈ రోజు ఎసైన్‌మెంట్? మొత్తానికి అదరకొడుతున్నావ్!' అన్నాడు జగన్ సిగరెట్ కాలుస్తూ నా వైపు వచ్చి.

'ఏంటీ  అదరకొట్టేది?' అన్నాను నవ్వుతూ.

'నీ పర్సనాల్టీతో... పెర్ఫార్మెన్స్‌తోనూ...!' అన్నాడు నవ్వి.

'పర్సనాలిటీయా?' అన్నాను చిరాగ్గా.

'అవును, మేడమ్! ఎడారిలో ఒయాసిస్‌లా మీరు ఆఫీసులో చేరినప్పటి నుంచి ఆఫీసు కళకళలాడిపోతోంది. డార్క్ బ్లూ జీన్స్, లైట్ బ్లూ కలర్ డెనిమ్ షర్ట్.... ఓహ్... అసలు జర్నలిస్టులు అంటే ఇలా ఉండాలి అని మీ ద్వారా తెలుసుకుంటున్నారు మన స్టాఫ్!' అన్నాడు తన్మయత్వంతో నన్నే చూస్తూ.

'షటప్! ఏం, అమ్మాయిలు పాంటు, షర్టు వేసుకోకూడదా? మా కన్వినియన్స్ కోసం వేసుకుంటున్నాం. దీన్లో ప్రత్యేకత ఏముంది?' అన్నాను.

'అందరూ వేస్తే ప్రత్యేకత లేకపోవచ్చు గానీ, మీరు వేస్తే డ్రెస్‌కి అందం వచ్చింది!' అన్నాడు సీరియస్‌గా.

అంతలో మారుతి పరుగున వస్తూ 'ఏమిటి మేడమ్, పిలిచారుట?' అన్నాడు కెమెరా బాగ్‌ను భుజంపైన తగిలించుకుంటూ.

'నేను పావుగంటలో జూబ్లీహాల్‌కు చేరుకుంటాను. మీరు కూడా వెంటనే బయలుదేరి అక్కడకు వచ్చేయండి! మోర్నింగ్ అమెరికా రాయబారిని ఎయిర్‌పోర్ట్‌లో మన సి. ఎం. గవర్నర్లు రిసీవ్ చేసుకోవటాన్ని కవర్ చేశారా?' అన్నాను.

'చేశాను, మేడమ్! ఇంకా ఫిల్మ్ కడగలేదు!' అన్నాడు.

'అప్పుడే వద్దులే! జూబ్లీ హాల్లో ప్రెస్‌మీట్ ఉంది, తెలుసు కదా!' అన్నాను.

'తెలుసు మేడమ్! ఎడిటర్‌గారు చెప్పారు.' అన్నాడు.

'వెల్! బాగా కవర్ చేయండి... క్లోజప్ షాట్స్ కూడా తీయండి!' అన్నాను.

'అలాగే మేడమ్! మీరు బయల్దేరండి! నేను పది నిమిషాల్లో అక్కడ ఉంటాను!' అన్నాడు.

' ఓ కే... బై!' అని చెప్పి హోండా స్టార్ట్ చేశాను.

'బెస్టాఫ్ లక్, మేడమ్!' అన్నాడు జగన్.

నేను నవ్వాను.

*　　　*　　　*

'రా, ఝాన్సీ కూర్చో!' అంటూ ఆప్యాయంగా ఆహ్వానించాడు ఎడిటర్ మూర్తి.

'ఏమిటి సార్ పిలిచారు?' అన్నాను నవ్వుతూ.

'ఏమీలేదు, ఝాన్సీ! నువ్వు మన పత్రికలో జాయిన్ అయిన ఆరు నెలల్లోనే బ్రహ్మాండంగా పేరు తెచ్చుకున్నావు. మెడిసిన్ కంటిన్యూ చేసి డాక్టరువి అయి ఉంటే పేరు తెచ్చుకునేదానివో కాదో తెలియదు కానీ, ఝాన్సీ అనే బై లైన్‌తో మన పత్రికలో ప్రచురించిన వార్తలు... వ్యాసాలన్నీ హైలైట్‌గా నిలిచి సెన్సేషనల్ రిపోర్టర్‌గా ఆంధ్రదేశమంతటా నీ పేరు మారుమోగిపోతోంది!' అన్నాడు సీరియస్‌గా.

'విషయం చెప్పండి, సార్! ఇంత ఉపోద్ఘాతమెందుకు?' అన్నాను నవ్వుతూ.

ఆయన ఖంగుతిన్నాడు.

'వస్తున్నా... పాయింట్‌కే వస్తున్నా! తొందరెందుకు?' అని గ్లాసులో నీళ్ళు తాగి సిగరెట్ వెలిగించుకున్నాడు.

'ఏమీ లేదమ్మా. ఎలక్షన్స్ ఇంకా రెండు నెలలే ఉన్నాయి. దేశం మొత్తం ప్రజల దృష్టి మన రాష్ట్ర అసెంబ్లీ ఎలక్షన్స్ పైనే ఉంది. ఎప్పుడూ లేనంత ఉత్కంఠ నెలకొని ఉంది. ఎందుకంటే అధికార పక్షం నేత, ప్రతిపక్షంనేత ఇద్దరూ ఇద్దరే... సమ ఉజ్జీలు. నీకు తెలియనిదేముంది చెప్పు? మనం కేవలం ఉద్యోగులం మాత్రమే. పేపర్ పాలసీ అంటూ ఒకటుంది కదా! ఈ రోజు నుంచి నువ్వు అధికార పక్షాన్ని సపోర్ట్ చేస్తూ స్పెషల్ స్టోరీస్ రెగ్యులర్‌గా ఫ్రంట్ పేజీకోసం రాయాలి. నువ్వు రాస్తేనే ప్రజలు నమ్ముతారు. నీకు అంత ఫాలోయింగ్ ఉంది మరి!' అన్నాడు నవ్వుతూ.

'సారీ సార్! నేను ఆ పని చేయలేను!' అన్నాడు సీరియస్‌గా.

'నువ్వు ఆ మాట అంటావని నాకు తెలుసు. ఇన్నాళ్ళూ మనం ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టే ఎన్నో వార్తలు ప్రచురించాం. ఎన్నో స్కూప్స్ బయట పెట్టాం. మెజారిటీ ఐటమ్స్ నువ్వు రాసినవే. ఆ విషయం నాకు తెలుసు!' అన్నాడు.

'మరి మళ్ళీ అదే చేత్తో పొగుడుతూ రాయమంటే ఎలా సార్? ఇది ఆత్మవంచన కాదా?' అన్నాను సీరియస్‌గా.

'చూడు, ఝాన్సీ! నువ్వు చిన్నపిల్లవు... పత్రికా రంగంలో ఇది మామూలే! ఎలక్షన్ టైమ్‌లో పాలసీలు మారుతూంటాయి. మన స్టేట్‌లో మన పత్రికకు మంచి పాపులారిటీ ఉంది. ఆ విషయం నీకూ తెలుసు కదా!' అన్నాడు మర్మగర్భంగా ఎడిటర్.

'అందుకే సార్! ప్రజలను పక్కదోవ పట్టించటం నా వల్ల కాదు!' అన్నాను.

"ఎం.డి.గారే స్వయంగా నాతో చెప్పారు. ప్రభుత్వాన్ని విమర్శిస్తూ ఇకపై మన పత్రికలో వార్తలు ప్రచురించకండి అని అన్నారు."

"అంతవరకూ బాగానే ఉంది సార్! విమర్శించకుండా బాలెన్స్‌గా ఉండటం వరకూ కొంతమేరకు సబబే! అలా కాకుండా తప్పుల్ని ఒప్పులుగా చేస్తూ పొగుడుతూ రాస్తూ పత్రికను అధికార పార్టీ పాంప్లెట్‌గా చేయటం... పైగా ఆ రాతలన్నిటినీ నాచేతే రాయించటం... నో... నా వల్ల కాని పని సార్!" అన్నాను ఏ మాత్రం మొహమాటం లేకుండా.

'ఎం.డి. గారే చెప్పారు. రెగ్యులర్‌గా రేపటినుంచి ప్రభుత్వాన్ని సపోర్ట్ చేసే వ్యాసాలను ఝాన్సీ చేత రాయించమని చెప్పారు. నీమీద ఆయనకు అంత నమ్మకం ఉంది. దాన్ని వమ్ము చేసుకోకు. వృద్ధిలోకి రావలసినదానివి. రేపు మళ్ళీ ఇదే ప్రభుత్వం ఎలక్షన్స్‌లో గెలిస్తే నీకు న్యూస్ ఎడిటర్‌గా ప్రమోషన్ కూడా ఇస్తామని చెప్పమన్నారు!' అన్నాడు మూర్తి మరో సిగరెట్ వెలిగించుకుంటూ.

'నో... సార్! నన్ను న్యూస్ ఎడిటర్‌గా చేసినా, ఎడిటర్‌గా చేసినా నేను మాత్రం ఆ పిచ్చిరాతలు రాయలేను. ప్రస్తుత ప్రభుత్వం ఎన్ని ఘోరమైన తప్పులు చేస్తూందో మీకు తెలుసు. అవినీతి ఎంతగా పేరుకుపోయిందో కూడా మీకు తెలుసు. మళ్ళీ ఇదే ప్రభుత్వం అధికారంలోకి వస్తే రాష్ట్రం ఎంతగా దిగజారుతుందో కూడా మీకు తెలుసు. ఈ నేపథ్యంలో నేను ఆత్మవంచన చేసుకుంటూ ఆ వ్యాసాలు రాయలేను. దయచేసి నా బాధను అర్థం చేసుకుని నన్ను బలవంత పెట్టకండి!' అన్నాను సీరియస్‌గా.

ఆయన కాసేపు మౌనంగా ఉండిపోయాడు.

కొన్ని క్షణాల అనంతరం స్థిరంగా అన్నాడు. 'దీని పర్యవసానం ఎలా ఉంటుందో నీకు తెలుసుకదా! ఎం. డి. మాట నువ్వు వినలేదంటే...' అని ఆయన మాట పూర్తి చేయకముందే నేను అన్నాను.

'నన్ను పొలైట్‌గా తప్పిస్తారు. ఆ రిస్క్ మీకెందుకుసార్? నేనే రిజైన్ చేస్తాను!' అన్నాను నేను స్థిరంగా.

'ఝాన్సీ!' అన్నాడు ఆయన ఆశ్చర్యంగా.

'అవును, సార్! నాకు వేరే దారిలేదు. ఇది నేను మీ మీద కోపంతో తీసుకుంటున్న నిర్ణయం కాదు. మీరంటే నాకిప్పటికీ గౌరవం ఉంది. నన్ను మీరు ఎంతగానో ఎంకరేజ్ చేశారు. ఒక విధంగా నాకు గురువులాంటివారు. కానీ తప్పదు సార్... నేను రాజీనామా చేస్తున్నాను!' అన్నాను.

ఆయన నావేపు నిశితంగా ఓ క్షణం చూసి, 'జర్నలిజంలో ఇది మామూలే, ఝాన్సీ! నువ్వెందుకీ విషయాన్ని ఇంత సీరియస్‌గా తీసుకుంటున్నావో నాకర్థం కావటంలేదు. అఫ్‌కోర్స్! నీకింకా ఈ ఫీల్డ్ విషయం పూర్తిగా తెలియదు!' అన్నాడు సీరియస్‌గా.

'ఆత్మవంచన చేసుకుంటూ కేవలం ఒక పార్టీకి బాకాలాగా పనిచేయటమే జర్నలిజం అంటే. అటువంటి జర్నలిజం... అదే ఈ ఫీల్డు గురించి అవగతం చేసుకోవటం అయితే.. ఆ అవగాహన నాకక్కర్లేదు. సార్! నా అభీష్టానికి వ్యతిరేకంగా నేను ఏ పనీ చేయలేను!' అన్నాను సీరియస్‌గా.

ఆయన అహం దెబ్బతింది.

'నిన్ను ఇంతకాలం ఎంకరేజ్ చేసినందుకు మా బాగా బుద్ధి చెప్పావు. నీ అభిప్రాయం అడగకుండానే, నా మాట కాదనవనే ఉద్దేశంతో ఎం.డి. గారికి మాటిచ్చాను. నువ్వు నా దగ్గర ఉండబట్టే నీకు ఇంత పేరు ప్రఖ్యాతులు వచ్చాయి. వేరే పత్రికలో చేరితే నిన్ను పట్టించుకునే నాథుడే ఉండడు. అందరూ నాలా ఎంకరేజ్ చేయరు!' అన్నాడు ముఖం కందగడ్డలా చేసుకుని.

'థాంక్స్ ఫర్ యువర్ కాంప్లిమెంట్స్ సార్! నన్నెవరూ ఎంకరేజ్ చేయనవసరం లేదు. నా రాతలే నన్ను ఎంకరేజ్ చేస్తున్నాయి. సెన్సేషనల్ వార్తకు పెద్దా చిన్నా పత్రికలనే తారతమ్యం ఉండదు. పత్రిక చిన్నదైనా ప్రచురించే వార్తతో సెన్సేషన్ సృష్టించవచ్చు అనే సిద్ధాంతాన్ని నమ్మినదాన్ని. నన్ను పెద్దపీట వేసి ఆహ్వానించక్కర్లేదు. ఓ మూల, కింద

కూర్చుని అయినా నేను వార్తలు రాయగలను. నాకు హిపోక్రసీ లేదు. డెమోక్రసీని కాపాడటమే నా లక్ష్యం!' అన్నాను సీరియస్‌గా.

'ఓ.కే. ఇక నువ్వు వెళ్ళవచ్చు. ఎప్పటికైనా నువ్వు నా దగ్గరకే వస్తావు. చిన్న ఉద్యోగమైనా ఇవ్వండి సార్ అని!' అన్నాడు సీరియస్‌గా.

'బతకటానికి మీ దగ్గరే ఉద్యోగం చేయక్కర్లేదు సార్! ప్రపంచం చాలా పెద్దది. నా భావాలనూ, ఆశయాలనూ మీలాగా ఎవరూ అర్థం చేసుకోలేకపోతే కూలిపనైనా చేసుకుంటూ బతకగలను. బట్... ఒక విషయం... నేను జర్నలిజంతోనే సెన్సేషన్ సృష్టిస్తాను. నేను నమ్మిన సిద్ధాంతాలతో వార్తలను రాస్తాను. నాకు సెలవిప్పించండి! నా రిజిగ్నేషన్ లెటర్‌ను యాక్సెప్ట్ చేయండి, పంపుతాను!' అంటూ సీరియస్‌గా బయటకొచ్చేశాను.

* * *

నమ్మిన సిద్ధాంతం కోసం, చేరవలసిన గమ్యం కోసం కన్నవారికి, స్నేహితులకు, బంధువులకు దూరమయ్యాను.

మెడిసిన్ డిస్‌కంటిన్యూ చేశాను. మంచి పొజిషన్ ఇస్తామని చెప్పినా ఉద్యోగానికి రాజీనామా చేశాను.

నా ఆలోచనలు సరైన రీతిలోనే నడుస్తున్నాయా?

ఛ... ఇంత దూరం వచ్చాక మళ్ళీ పిరికిదానిలా ఈ ఆలోచనలు ఏమిటి ఈ రోజు ఇలా పయనిస్తున్నాయి?

తల విదిల్చాను... ఉద్యోగం మానేసి నెలరోజులయింది. జీతంలో ఆఖరి వందరూపాయలు నిన్ననే మార్చాను. ఇప్పుడు చేతిలో ముప్పై రూపాయలు మాత్రమే ఉన్నాయి. ఈ రోజు రేపు తిండికి సరిపోతాయి. ఆ తర్వాత? ఎలా జరగాలో అలా జరుగుతుంది...! నన్ను పూర్తిగా అర్థం చేసుకునే మిత్రుడు కానీ, మిత్రురాలు గానీ ఒక్కరు కూడా లేకుండా పోయారు. నా బాధల్ని... ఆలోచనల్ని మరొకరితో పంచుకుంటే కాస్త మనశ్శాంతి దొరికేది. ఆ అదృష్టం కూడా లేకుండా పోయింది. ఉద్యోగం మానేసిన తర్వాత ఎక్కడా ఫుల్‌టైము ఎంప్లాయీగా చేయబుద్ధి కాలేదు. ఏ పత్రిక చూసినా ఏముంది గర్వకారణం? అన్నట్లు అక్కడైనా నా సిద్ధాంతం ప్రకారం వార్తలు రాస్తే ప్రచురిస్తారని గ్యారంటీ ఏముంది? ఓ విధమైన నిర్లిప్తత నాలో చోటు చేసుకుంది. అందుకే ఫ్రీలాన్సర్‌గా కొన్ని పత్రికలకు ఆర్టికల్స్ పంపాను. కొన్ని ప్రచురితమయ్యాయి. నాకు బోలెడంత

ధైర్యమొచ్చింది. సెల్ఫ్ శాటిస్‌ఫ్యాక్షన్ లభించింది కానీ, రెమ్యునరేషనే ఇంత వరకూ లభించలేదు. మా పత్రికలో ఫుల్‌టైమ్ రిపోర్టర్‌గా జాయినవ్వండని రెండు మూడు పత్రికలవాళ్ళు ఆల్రెడీ ఇన్వైట్ చేశారు గానీ, నేనే జాయిన్ కాలేదు. కొన్నాళ్ళపాటు ఇలా ఫ్రీగా ఉండాలనిపించింది. ఇంటి దగ్గరనుంచి ఉత్తరాలు కూడా ఆగిపోయాయి. లాస్ట్ మంత్ అమ్మ నాకో సుదీర్ఘమైన ఉత్తరం రాసింది. ఉన్నపాటున ఇంటికొచ్చెయ్యమని... మంచి పెళ్ళి సంబంధం చూశారట. అబ్బాయికి బ్యాంక్ ఉద్యోగమట. నాన్నగారు మరీ మరీ చెప్పి రాయించారట ఆ ఉత్తరం. వెంటనే రమ్మని రాసింది. ఉత్తరం అందిన వారం రోజులలోపు రాకపోతే ఇక నీకూ, మాకూ మధ్య బంధం తెగిపోయినట్లే! నువ్వు చచ్చిపోయావని అనుకుంటామని రాసింది. నేను నిర్వేదంగా నవ్వుకున్నాను. నాకు ఉత్తరం అంది నెలరోజులపైనే అవుతోంది. రిప్లై కూడా ఇవ్వలేదు. ఈపాటికి నాకు పెద్దకర్మ కూడా చేసే ఉంటారు. నాన్నగారి పట్టుదల తెలియంది కాదు. ఆయనగారికి ఏ మాత్రం తీసిపోని వ్యక్తి అన్నయ్య. వాళ్ళిద్దరి మధ్యా నలిగిపోతూ అటు వారికి, ఇటు నాకూ చెప్పలేక సతమతమయ్యే సగటు గృహిణి అమ్మ.

నాన్నగారి మొండితనమే నాకూ వచ్చినట్లుంది. ఆయన పట్టుదలకు ఏమాత్రం తీసిపోని విధంగా నేను తయారయ్యాను. ఏమిటి... ఈ రోజంతా నా ఆలోచనలు ఇంటివైపు మొగ్గుతున్నాయి... నా మనసు బలహీనపడుతోందా? నో... అలా జరగటానికి వీల్లేదు. ఈ వారం రోజుల్లో నేను ఏదో ఒక సెన్సేషనల్ ఐటమ్ తయారు చేయాలి. వీలైతే నెక్స్ట్ వీక్ ఏ పత్రికలోనైనా జాయినవ్వాలి. ఇలా ఫ్రీలాన్సింగ్ చేస్తుంటే మనసు పరిపరి విధాల పోతోంది. సాధ్యమైనంత వరకూ బిజీగా మారిపోవాలి. అప్పుడు సెకండ్ థాట్ అంటూ ఏదీ రాదు. ఎలక్షన్ టైమ్ కనుక ఏదైనా సెన్సేషనల్ స్టోరీ రాస్తేనే బాగుంటుంది. సత్య పత్రికలవాళ్ళు కవర్‌స్టోరీ ఇవ్వండి మేడమ్ అని అడిగారు. వాళ్ళకోసం ఏదైనా సెన్సేషనల్ ఐటమ్ వ్రాయాలి.

* * *

ప్రాణానికి తెగించి పరుగు తీస్తున్నాను.

చెప్పులు చేత్తో పట్టుకుని పళ్ళ బిగువున శక్తికొద్దీ పరుగులు తీస్తున్నాను. అది మట్టిరోడ్డు... మసక మసక వెలుతురు. టైము పదకొండు అయి ఉంటుంది. దూరంగా మెయిన్‌రోడ్డుపై ట్రాఫిక్ లైట్లు కనిపిస్తున్నాయి. ఎలాగైనా సరే నేను వీళ్ళకు చిక్కకుండా రోడ్డువరకూ వెళ్ళి ఎవరినైనా లిఫ్ట్ అడిగి సిటీకి చేరుకోవాలి. వెనక్కి తిరిగి చూశాను. దూరంగా... చాలా దూరంగా కేకలు వినిపిస్తున్నాయి. నేను మరింత వేగం పెంచాను. ఎదురుదెబ్బ తగిలి బోర్లాపడ్డాను.

'అమ్మా!' నా కేక ప్రతిధ్వనించింది.

వెంటనే లేచి పరుగు తీశాను. మెయిన్‌రోడ్డు ఇంకా పదిగజాల దూరం మాత్రమే ఉంది. నుదుటి పై నుంచి రక్తం కారుతోంది. అరికాళ్ళు చీరుకుపోయాయి. అయినా లెక్కచేయకుండా అలాగే పరుగెత్తి రోడ్డుపైకి చేరుకున్నాను. ఎదురుగా ఏదో వెహికల్ వస్తోంది. రెండు చేతులూ ఊపుతూ ఆపమని సంజ్ఞ చేశాను. లారీ వేగంగా దూసుకుపోయింది. మళ్ళీ చీకటి... వెనక్కి తిరిగి చూశాను. దూరంగా వాళ్ళ అరుపులు వినిపిస్తున్నాయి. భగవంతుడా... ఏదైనా వెహికల్ వస్తే బాగుండు...! దూరంగా లైట్లు కనిపిస్తున్నాయి. నేను దాదాపు రోడ్డు మధ్యకు వచ్చి చేతులు ఊపాను. నాలో ఓ విధమైనటువంటి తెగింపు... వాళ్ళకు చిక్కితే నన్ను ఇక్కడే చంపేసి కెమెరా... టేప్‌రికార్డర్ ధ్వంసం చేసేసి పక్కనే ఉన్న తుప్పల్లో పడేసి పోతారు. అందుకే ఈ నిజాన్ని ఎలాగైనా వెలుగులోకి తేవాలి... అనుకుంటూ చేతులు ఊపుతున్నాను. ఎదురుగా ఏదో కారు నన్ను చూసి క్రమంగా స్లో అయింది. నా పక్కనే ఆగింది.

'లిఫ్ట్ ప్లీజ్!' అన్నాను.

అతను నన్ను విచిత్రంగా చూసి డోర్ తీశాడు.

అంతే! క్షణంలో ఒక్క గెంతులో కార్లోకి దూకాను. కారు వెంటనే స్టార్టయి ముందుకు తీసుకెళ్ళింది. నేను వెనక్కి తిరిగి చూశాను. వాళ్ళు అప్పుడే రోడ్డుపైకి వచ్చి నిస్సహాయంగా కారువైపు చూస్తూ నిలబడిపోయారు.

నేను తృప్తిగా కళ్ళు మూసుకున్నాను.

* * *

'అధికారం కోసం పసిపిల్ల బలి!'

దానికిందే డెక్‌లో 'మంత్రి నిర్వాకం' అనే ఐటమ్‌ను తృప్తిగా చదువుకుని కింద బైలైన్ చూసుకున్నాను గర్వంగా... ఝాన్సీ అనే రెండక్షరాలను.

రాత్రి నేను చేసిన సాహసం గుర్తొచ్చి వెన్నులో వణుకు పుట్టింది. జగన్ కోసం నేను కూకట్‌పల్లి వెళ్ళటం, అతని రూమ్ లాక్‌చేసి ఉండటం, రాత్రి తొమ్మిదిగంటల వరకు వెయిట్ చేసి అతను రాకపోతే ఆ స్లమ్ ఏరియాలో నుంచి వస్తుంటే ఆ గుడిసెవాసుల గూర్చి ఐటమ్ రాయాలనిపించి వాళ్ళను ఇంటర్వ్యూ చేయటం ఆలస్యమైతే అక్కడే వాళ్ళతో పాటు భోజనం చేయటం... నా పక్కనే కూర్చున్నవాళ్ళు 'మంత్రిగారు ఎన్నింటికి వస్తారు?' అని ముచ్చటించటం

నా చెవిలో పడింది. నేను ఆసక్తిగా వారి మాటలు విని ఆశ్చర్యపోయి వాళ్ళకు తెలియకుండా వాళ్ళను ఫాలో అవటం... మంత్రి పదకొండు గంటలకు అక్కడకొచ్చి నిర్జన ప్రదేశంలో పసిపాపను బలి ఇవ్వబోతుంటే నేను ఫోటోలు తీయటం... అది వాళ్ళు గమనించి నా వెంటబడటం.. ఓహ్... జరిగిందంతా ఓ పీడకలలా సినిమా రీలులా నా కళ్ళముందు ప్రత్యక్షమైంది. ఎన్నికల్లో గెలవటానికి ఎంత దారుణానికి పూనుకున్నాడు?

'మేడమ్! ఎడిటర్‌గారు పిలుస్తున్నారు!' సబ్ ఎడిటర్ గిరి చెప్పాడు. నేను ఎడిటర్ ఛాంబర్లోకి వెళ్ళాను.

'చూడమ్మా, ఝాన్సీ! నువ్వు రాత్రి మాకు తెచ్చిచ్చిన ఐటమ్ చాలా సెన్సేషన్ సృష్టిస్తోంది. నీ ప్రాణాలకు తెగించి ఆ ఐటమ్ కవర్ చేయటం గొప్ప సాహసం. ఎలక్షన్స్ ఇంకా పది రోజులే ఉన్నాయి. ఈ వార్త ప్రభావం ఖచ్చితంగా ఎన్నికలపై పడుతుంది. అధికారపక్షం ఖచ్చితంగా ఓడిపోతుంది. ఇప్పటికి ఎన్ని ఫోన్లు వచ్చాయో లెక్కలేదు... మన పత్రికను ప్రశంసిస్తూ... ప్రతిపక్ష నాయకుడు నీకు ఫుల్ సెక్యూరిటీ ఏర్పాటు చేస్తామన్నారు. ఈ రోజు నుంచి నీకో గన్‌మాన్‌ని ఇస్తున్నాం. ఈ రోజు ఈవెనింగ్ ప్రతిపక్ష నాయకుడు మనిద్దరినీ ఆయన ఇంటికి డిన్నర్‌కు పిలిచాడు!' అన్నాడు ఎడిటర్.

'నాకు ఇవన్నీ ఇష్టంలేదు సార్! నాకు డిన్నర్లు కాదు కావాల్సింది సమాజ శ్రేయస్సు! అయినా నేను చావుకు భయపడను. నాకు గన్‌మాన్‌లు ఎందుకుసార్?' అన్నాను ఆశ్చర్యంగా.

'నో! నే ఒప్పుకోను. నీది అమూల్యమైన ప్రాణం. ఒక రాజకీయ పార్టీ భవిష్యత్తునే అంధకారం చేశావు. వాళ్ళ దృష్టి నీపైన పడుతుంది. అందుకే నీకు ఏ ప్రమాదం జరగకుండా పోలీస్ ప్రొటెక్షన్ కూడా ఇవ్వబోతున్నాం. కొన్నాళ్ళపాటు నీకు ఈ సెక్యూరిటీ తప్పదు!' అన్నారు నవ్వుతూ.

అటెండర్ వచ్చి 'సార్! నీకోసం బయట ఈయన వెయిట్ చేస్తున్నారు.' అంటూ విజిటింగ్ కార్డు ఇచ్చాడు.

'అరె... మూర్తిగారా? రమ్మను లోపలికి!' అన్నాడు ఎడిటర్.

నేనొక్కసారి ఉలిక్కిపడ్డాను. ఈయనేమిటి ఇక్కడికొస్తున్నారు? అనుకుని, 'నేను వెళ్తున్నాను, సార్!' అన్నాను.

'అరెరె... అదేమిటీ... కూర్చోమ్మా! మీ మాజీ ఎడిటరేగా!' అన్నారు నవ్వుతూ.

'నమస్కారం ఎడిటర్‌గారూ!' అంటూ ఆయన లోపలికొచ్చారు.

నేను ఇబ్బందిగా కూర్చున్నాను.

'అమ్మాయ్, ఝాన్సీ! మొత్తానికి నా శిష్యురాలివనిపించావ్... నా పేరు నిలబెట్టావు! మనస్ఫూర్తిగా నిన్ను అభినందించటానికే వచ్చాను!' అన్నాడు. నేను ఒక్కసారిగా షాక్ అయ్యాను. గతాన్ని ఆయన ఎంత ఈజీగా మర్చిపోయి ప్లేటు మార్చి మాట్లాడుతున్నాడు? అనుకుని పైకి మాత్రం నవ్వుతూ, 'థ్యాంక్యూ సార్!' అన్నాను.

'ఝాన్సీ! నువ్విక ఫ్రీలాన్సింగ్ చేయనవసరంలేదు! మా దగ్గరే నీకు బ్యూరోలో చీఫ్‌గా ఉద్యోగం ఇస్తున్నాను!' అన్నారు సత్య పత్రిక ఎడిటర్.

మూర్తిగారు ఖంగుతిన్నాడు. ఆయన నన్ను తన పత్రికలో ఇన్వైట్ చేయటానికే నన్ను అంతగా పొగిడాడని సత్య పత్రిక ఎడిటర్ గుర్తించి వెంటనే ఇలా అన్నారు.

నేను 'థ్యాంక్యూ సార్!' అన్నాను వెంటనే. 'వెల్! ఝాన్సీలాంటి డైనమిక్ యంగ్ లేడీ... వీరత్వం ఉట్టిపడే రిపోర్టర్ మీకు లభించటం నిజంగా మీ అదృష్టం. ఎడిటర్ గారూ! కంగ్రాట్స్!' అన్నాడు మూర్తి.

మొత్తానికి నువ్వనుకున్నది సాధించావమ్మా! నీ లక్ష్యాన్ని... ఆశయాన్ని అనతికాలంలోనే సాధించావు. ప్రలోభాలకు లొంగకుండా, ఒక సిద్ధాంతానికి కట్టుబడి పనిచేసే నీలాంటి జర్నలిస్టులు ఉన్నంతకాలం పత్రికల విలువలు పెరుగుతూనే ఉంటాయి. నిన్ను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను!' అన్నారు మూర్తిగారు నాతో.

'థ్యాంక్యూ సార్!' అన్నాను రెండు చేతులతో నమస్కరిస్తూ.

* * *